క్లుప్తంగా

ఘనంగా అంకాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



మినీ విద్యుత్ ప్రభపై అంకాలమ్మ తల్లి

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోటలో వెలసిన అంకాలమ్మ తల్లి ఆలయ 3వ వార్షికోత్సవం భక్తులు ఆదివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. పంచాయతీ పరిధిలోని బసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రెడ్ల కులానికి చెందిన అంకాలమ్మ తల్లి ఆలయంలో మినీ విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. అంకాలమ్మ తల్లిని గ్రామంలో పుర వీధుల్లో భజంత్రీలు, మేళ తాళాలతో ఊరేగించారు. అంకాలమ్మ తల్లి మా ఊరిని చల్లగా చూడమ్మా, పిల్లా పాపలు సమృద్ధిగా ఉండాలి, పాడి పంటలు పండాలంటూ మహిళలు పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలు గ్రామస్తులు, భక్తులకు అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లూరు: మండల కేంద్రం తాళ్లూరులో మంగళవారం 33 కేవీ విద్యుత్ టవర్స్‌కు వైర్ ఏర్పాటు పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉందని జేఈ ఇమ్మానియేలు బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు తగిన జాగ్రత్తలు పాటించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని జేఈ కోరారు.

రేషన్ సరుకులు డీలర్లతో పంపిణీ

బేస్తవారిపేట: మండలంలోని రేషన్ కార్డుదారులకు జూన్ నెల నుంచి నిత్యావసర సరుకులు డీలర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ జితేంద్రకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండీయూ వాహనాలను ప్రభుత్వం నిలిపివేసిందని పేర్కొన్నారు. రేషన్ దుకాణం పరిధిలో 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య డీలర్ ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో ఉదయం 8 నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 వరకు రేషన్ పంపిణీ చేస్తారని వివరించారు.

పోస్టల్ సేవలకు అంతరాయం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని హెడ్ పోస్టాఫీసులో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆన్‌లైన్ సర్వర్ పనిచేయకపోవడంతో సేవలు నిలిచి ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు ఖాతాదారులు క్యూలో నిల్చోలేక ఇంటికి వెళ్లిపోయారు.

మందుబాబులకు రూ.30 వేల జరిమానా

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురిని అరెస్టు చేసి మార్కాపురం కోర్టులో ప్రవేశపెట్టగా అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాసు మేజిస్ట్రేట్ ఎం.బాలాజీ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ముగ్గురికి రూ.30 వేల జరిమానా విధించినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఆటోను సీజ్‌చేసి కోర్టులో హాజరుపరచగా 2,500 రూపాయల జరిమానా విధించారని చెప్పారు. వాహనదారులు మద్యం సేవించినా, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆపరేషన్ సిందూర్ అమరులకు ఘన నివాళి



ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికులు

బేస్తవారిపేట: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా బేస్తవారిపేటలో మాజీ సైనికుల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక మాజీ సైనికుల సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన జవాన్లకు ఘన నివాళులర్పించారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం ప్రతిదాడి చేయడం హర్షణీయమన్నారు. దేశ సంక్షేమం కోసం తామంతా సిద్ధంగా ఉన్నామని, భారత్ మాతాకి జై అని నినదించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, సంఘ నాయకులు పి.వెంకటరాజు, కేవీ రెడ్డి, ఖాశీంవలి, రమణారెడ్డి, పాండు, వెంకటేశ్వర్లు, యల్లారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అధ్వానంగా మరుగుదొడ్లు



అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు



అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణం

- అత్యవసరం వేళ సిబ్బందికి తిప్పలు
- వేదన అనుభవిస్తున్న మహిళా సిబ్బంది

పెద్దారవీడు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధ్వాన స్థితిలో ఉండటంతో వినియోగించేందుకు వీల్లేకుండా పోయింది. సిబ్బంది అత్యవసరం వేళ పడుతున్న వెతలు అన్నీ ఇన్నీ కావు. 10 రోజుల క్రితం మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన మహిళా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంతో నానా తిప్పలు తప్పలేదు. కార్యాలయ సిబ్బందేగాక నిత్యం వివిధ పనులపై వచ్చే వారు కూడా అత్యవసర సమయంలో ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి అవసరమని, ఆరుబయట విసర్జన చేయకూడదని గ్రామాల్లో అధికారులు చాటింపులు వేయిస్తారు. ప్రజల్లో మరుగుదొడ్ల వినియోగంపై తీసుకున్న శ్రద్ధ అధికారులు తమ కార్యాలయంలో ఉన్న మరుగుదొడ్ల వినియోగంపై దృష్టి సారించకపోవడం విడ్డురంగా ఉంది. మండల కేంద్రం పెద్దారవీడు సచివాలయం మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేసి భవనం నిర్మాణం చేశారు. మరుగుదొడ్ల నిర్మాణ సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో అసంపూర్తిగా నిలిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్లు నిర్మించాలనే ఆలోచన చేయక పోవడంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే సచివాలయానికి మహిళలు వివిధ పనుల కోసం నిత్యం వస్తుంటారు. వివిధ పనుల మీద వచ్చే వారికి మరుగుదొడ్డి సమస్య వెంటాడుతోంది. సిబ్బందితో పాటు సచివాలయానికి వచ్చే వారికి మరుగుదొడ్డి లేకపోవడంతో అత్యవసర సమయంలో ఆరుబయటకు వెళ్లాల్సిందే. పశువైద్యశాల సిబ్బందితో పాటు పనులపై వచ్చే వారికి మరుగుదొడ్లు లేకపోవడంతో అత్యవసర సమయంలో ఆరుబయటకు వెళ్లాల్సిందే. అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన సచివాలయ మరుగుదొడ్లను, పశువైద్యశాలలో నూతనంగా మరుగుదొడ్లను అన్ని వసతులతో నిర్మించాలని, అశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకొని మహిళలకు ఆత్మగౌరవాన్ని కల్పించాలని కోరుతున్నారు.

జగనన్న పర్యటనను విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

దొనకొండ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పొదిలిలోని పొగాకు వేలం కేంద్రం పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కాకర్ల కృష్టారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు పండించిన పొగాకు, మిరప, కంది తదితర పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వక పోవటంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జగనన్న పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముండ్లమూరు (కురిచేడు): పొదిలి పొగాకు బోర్డు పర్యటనకు వస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమం జయప్రదం చేయాలని ఆ పార్టీ ముండ్లమూరు మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జగనన్నతో పాటు కలిసి రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పొగాకు రైతులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉందనే భరోసాను రైతులకు కల్పించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో బయల్దేరి రావాలని ఆయన కోరారు. నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు బంకా నాగిరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి సూదిదేవర అంజయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

పుల్లలచెరువులో వర్షం



నీటితో కళకళలాడుతున్న రామన్నచెరువు

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువులో ఆదివారం రాత్రి రెండు గంటల పాటు భారీ వర్షం పడింది. దీంతో గ్రామాల్లోని చెర్వులు, కుంటలకు నీరు చేరాయి. ఆదివారం రోహిణీ కార్తె మొదలు కావడంతో ఎండలకు రోళ్లు పగలాలి అంటారు పెద్దలు. కానీ వర్షం జల్లులతో స్వాగతం పలికింది. పుల్లలచెరువులో ఎక్కువ వర్ష పాతం నమోదైంది. రైతులు పంట పొలాలను బాగు చేసుకునే వీలు కల్గుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పశువులకు తాగేందుకు, మేతకు ఇబ్బంది లేదని పశు పోషకులు పేర్కొంటున్నారు. పుల్లలచెరువులో కాటి వీరన్నచెర్వు, రామన్నచెర్వులకు ఒక మోస్తరు నీరు చేరింది. కవలకుంట్లలోని చెర్వుకు కూడా నీరు చేరడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గొబ్బూరులో అంతర్గత రోడ్లు అధ్వానం



అధ్వానంగా మట్టి రోడ్డు

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరులో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మట్టి రోడ్లు కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై మట్టి లేచి గుంతలు పడుతున్నాయి. వర్షం పడిన ప్రతిసారి వర్షం నీరు రోజుల తరబడి వీధుల్లో నిలిచి ఉంటోంది. దీని ద్వారా దుర్వాసనలు రావడంతో పాటు దోమలు వ్యాప్తి అధిక మవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో కొన్ని బజారుల్లో మట్టి రోడ్లు కావడం, రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మట్టి రోడ్లపై రోజుల తరబడి మురుగు నీరు నిలిచి ఉంటోంది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మట్టి రోడ్లను సిమెంటు రోడ్లగా మార్చేందుకు రూ.24 లక్షలు నిధులు మంజూరు చేశారు. రోడ్డు పనులు మొదలు పెట్టాలని అనుకునే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులను టీడీపీ కార్యకర్తలు తమ బజారులకు సిమెంటు రోడ్లు వేసుకున్నారని సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ యాదవ్ తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నాయకులు మట్టి రోడ్లకు నిధులు మంజూరు చేసి సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'కాకాణి' అరెస్టు అప్రజాస్వామికం

- మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని, మైనింగ్ విషయంలో ఆయనకు ఎలాంటి సంబంధం లేకపోయినా ఎవరో ఇచ్చిన అబద్ధపు వాంగ్మూలం ఆధారంగా అరెస్టు చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. మైనింగ్ విషయంలో నమోదైన కేసుపై కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇప్పటికే న్యాయస్థానంలో సవాలు చేశారని, ఆ కేసులో బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు అరెస్టు కుట్రను అమలు చేశారని దుయ్యబట్టారు. అరెస్టు సమాచారం గోప్యంగా ఉంచడం చట్ట విరుద్ధమని, పోలీసు బాధ్యతా రహితంగా వ్యవహరించడం సరికాదన్నారు. తమకు గిట్టని వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తూ కూటమి ప్రభుత్వం దుస్సంప్రదాయానికి తెరతీసిందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే వేధింపులకు పాల్పడినవారు బయట తిరిగే పరిస్థితి కూడా ఉండదని హెచ్చరించారు. టీడీపీ నేతల అక్రమాలు, దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదని, దీని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే నెలకో కొత్త నాటకం తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు.

నల్లబర్లీ పొగాకు నిల్వల పరిశీలన



ఇండ్లచెరువు నల్లబర్లీ పొగాకును పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మీనారాయణ

దొనకొండ: వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు నిల్వలను వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సోమవారం పరిశీలించారు. ఇండ్లచెరువులో గ్రామ వ్యవసాయ సహాయకుడి ఏపీఎంఏఐఎస్ యాప్‌లో నమోదు తీరును తనిఖీ చేసినట్లు ఏఓ తెలిపారు. గత సంవత్సరం సాగు చేసిన నల్లబర్లీ పొగాకు రైతుల వద్ద మిగిలిపోయిన స్టాక్‌ను భౌతికంగా చూసిన తర్వాతనే యాప్‌లో సిబ్బంది నమోదు చేశారన్నారు. ఇప్పటి వరకు మండలంలో 87 మంది రైతులకు సంబంధించి 1700 క్వింటాళ్ల పొగాకును నమోదు చేశామన్నారు. ఇంకా ఎవరి దగ్గరైనా నల్లబర్లీ పొగాకు స్టాక్ ఉంటే ఆయా గ్రామ రైతు సేవా కేంద్రాలను సంప్రదించి నమోదు చేసుకోవాలని ఏఓ లక్ష్మీనారాయణ సూచించారు.

రైల్వే అండర్ పాస్ జలమయం



అండర్ పాస్‌లో నిలిచిన నీరు

దొనకొండ: రైల్వే అధికారులు నిర్లక్ష్యంతో వాహన చోదకులు అగచాట్లు పడుతున్నారు. అండర్‌పాస్ రహదారిలో నీరు నిల్వ ఉండి వాహనాలకు, పాదాచారులు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. అండర్‌పాస్‌లో నిలిచిన నీరు బయటకు వెళ్లేందుకు సారంగం నాసిరకంగా నిర్మించారు. వర్షం పడిన సమయంలో నిలిచిన నీరు బయటకు పంపేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వర్షం పడితే అండర్‌పాస్‌లో 20 రోజులు నీరు నిలిచి ఉంటున్నాయి. రైల్వే ట్రాక్‌కు రెండు పక్కలా నివాసాలు ఉన్నాయి. బ్యాంక్, పోస్టాఫీస్, పోలీస్‌స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్ మరీ ముఖ్యంగా వైద్యశాల కోసం నిత్యం ఈ అండర్‌పాస్ నుంచి ప్రజలు వస్తుంటారు. రైల్వేస్టేషన్‌కు, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాలకు నిత్యం రావాల్సి వస్తుంది. అంతేకాకుండా విద్యార్థులు పాఠశాలలకు వస్తుంటారు. నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు భయపడి ఇళ్లకు వెళ్లిన సందర్భాలు చాలా ఉన్నాయి. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయ స్థలం కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి

- సబ్ కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుడి వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జయరాజ్

మార్కాపురం టౌన్: కంభం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ కంఠంలో సచివాలయం-4 నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి, బేస్‌మెంట్‌ను ధ్వంసం చేసిన వ్యక్తిపై, సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఎస్.జయరాజ్ సోమవారం మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు అర్జీ అందజేశారు. సచివాలయ బేస్‌మెంట్‌ను ధ్వంసం చేసిన విషయమై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికై నా సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుని కోటి రూపాయలు విలువగల ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. సబ్సిడీపై రైతులకు విత్తనాలు, మైక్రోఇరిగేషన్ పరికరాలు అందించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల నాయకులు సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, పెట్టుబడి సాయం అందించాలని సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. కార్యక్రమంలో కొండయ్య, రామయ్య, కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. కాగా డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి పలువురు అర్జీదారులు తమ సమస్యలపై సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

మోక్షగుండంలో సీపీఐ జెండా ఆవిష్కరణ



సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండం బీసీ కాలనీలో సీపీఐ మహాసభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కేవీ రమణ, సీనియర్ నాయకులు ఢాకాల పుల్లయ్య మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అయిందని, ఇప్పటి వరకు ప్రజల పక్షాన ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. మోక్షగుండం బీసీ కాలనీ ఏర్పడి 36 ఏళ్లు అవుతున్నా పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తాళ్ల రంగారెడ్డి, యు.జోసఫ్, ఏఐటీయూసీ నాయకుడు యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుదలకు శిబిరాలు



మాట్లాడుతున్న గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి

బేస్తవారిపేట: విద్యార్థులు విజ్ఞానం, నైపుణ్యాన్ని పెంచుకోవడానికి వేసవి శిక్షణ తరగతులు దోహద పడతాయని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన మాట్లాడారు. చెస్, బొమ్మలు గీయడం, కథలు చెప్పడం, ఇంగ్లిష్ గ్రామర్‌పై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి

గిద్దలూరు రూరల్: మహిళపై కత్తితో దాడి చేసిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు గిద్దలూరు సీఐ కె.సురేష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన జడపోగు సుధారాణికి అదే గ్రామానికి చెందిన కసిరెడ్డి తరుణ్ అనే వ్యక్తి మధ్య ఆర్థిక లావాదేవీల విషయమై ఘర్షణ తలెత్తింది. దీంతో సుధారాణిపై తరుణ్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మృతుల కుటుంబాలకు 'అన్నా' పరామర్శ



కంభాలపాడులో లక్ష్మీనారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

పొదిలి రూరల్: కొనకనమిట్ల మండలం మెట్టువారి పల్లెకు చెందిన యువకుడు మెట్టు మాధవరెడ్డి ఆదివారం పొదిలి డిపో వద్ద బస్సు ఢీకొనడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. పొదిలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉన్న మాధవరెడ్డి మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సందర్శించి నివాళులర్పించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే కంభాలపాడులో దొండ్లపాటి లక్ష్మీనారాయణ సోమవారం గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పొదిలి మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, నాయకులు ఉన్నారు.

పశ్చిమ ప్రకాశం వ్యాప్తంగా వర్షాలు



మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో నిలిచిన వర్షం నీరు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశం వ్యాప్తంగా సోమవారం వర్షం కురిసింది. మార్కాపురంలో 27.2 మిల్లీమీటర్లు, పెద్దారవీడులో 36.4, దోర్నాలలో 16.4, యర్రగొండపాలెంలో 78.8, త్రిపురాంతకంలో 38.4, పుల్లలచెరువులో 76, కంభంలో 35.4, బేస్తవారపేటలో 20.4, అర్ధవీడులో 20.4, గిద్దలూరులో 18.2, రాచర్లలో 15, కొమరోలులో 12.4, తర్లుపాడులో 46.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. డివిజన్ వ్యాప్తంగా సగటున 34 మి.మీ వర్షం పడిందని అధికారులు తెలిపారు.